# పెంకి పెళ్ళాం

౩

"కమ్మా-కథ చెప్పనా" అని అడిగాడు పరమేశం. వంటింట్లోకి వచ్చి కూర్చుంటూ.

ఏడుచేపలా కథా-బ్రహ్మరాక్షసి కథా" అని మోకాళ్ళు దగ్గరగా లాక్కుని గడ్డం మోకాళ్ళ మీద పెట్టి అడిగింది.

"ఛా—ఛా—అవన్నీ పేదరాశి పెద్దమ్మ కథలు, చిన్న పిల్లాడు చెప్పేవి కాదుగా" అన్నాడు పరం.

"ఇంతకీ మీరు చిన్నపిల్లల కోవకు చెందుతారనా మీ ఉద్దేశం" అని అడిగింది కమల బియ్యంచేటను దగ్గరగా లాక్కుని.

"నీకేమేగాని మా నాయనమ్మకు నేనింకా చితకపిల్లాడినే తెలుసా"

"అని పరంఅనగానే, ఇంకానయంనిన్నే పుట్టానన్నారు కాదు. ముందిక్కడ్నుంచి కదలండి వంటిల్లు కడగాలి" అంది కమల లేస్తూ. కాని అతను లేవకుండానే, "ముందు కథ చెప్పనీ ఆతర్వాత ఆలోచిద్దాం" అని ఇంకేమో చెప్పబోతుండగా కమల మధ్యలో అందుకుని.

"కథ అయిపోయింతర్వాత అప్పలమ్మకు మీరు సాయపడతారా మరి" అంది.

"ఇంకేం నాకథలో మెటీరియల్ కూడా అదే. అలాగే సాయపడ్తా సరేనా" అన్నాడు పరమేశం.

"వద్దుబాబూ మీ నాయనమ్మగారి అక్షింతలు ఇక్కడ వర్షిస్తాయి, వడగళ్ళలాగా... బాబూ బతిమాలుకుంటాను. కాస్త వెళ్ళి మీ గదిలో కూర్చోండి" అంది కమల బ్రతిమాలుకుంటూ.

"సరే జాలి దలిచి వదిలిపెడ్తున్నా" అంటూ పరమేశం వంటిల్లుదాటి తన గదిలోకి వెళ్ళి తలుపు గడియపెట్టి, సిగరెట్టు వెలిగించి వారపత్రికను తీసుకుని కుర్చీలో కూర్చున్నాడు.

కమల పనంతా ముగించుకుని కాఫీకప్పు చేత్తో పట్టుకుని తలుపుకొట్టింది. కొట్టిన 5 నిమిషాలకు పరమేశం తలుపు తీశాడు.

ఆతర్వాత కమల లోపలికొచ్చింది.

కమలను చూడగానే పరం

"ఓ అతిలోకసుందరీ నీ సౌందర్యానికివే నా జోహారులు, నీ అతిలోక సుందరహస్తాల మృదుత్వమును చవిచూచిన ఆ కాఫీకప్పు ఎంత ధన్యురాలో కదా" అని ఇంకేమో చెప్పబోతుండగా కమలమధ్యలో అడ్డువచ్చి.

"ఇప్పుడు ఆబల్లక్రిందనున్న సిగరెట్టుతీసి వీధిలో పారవేయకపోతే నాచేతి మృదుత్వాన్ని మీరు కూడా చవి చూడవలసి వస్తుంది" అంది నవ్వుతూ.

"మేష్టారూ—ఇంకెప్పుడూ చేయనండి, బాబోయ్ దెబ్బ తగుల్తుంది సార్, అమ్మోయ్ మాష్టారూ కొట్టకండి, ఇంకెప్పుడూ సిగరెట్లు కాల్చనండి, ఈసారికి వదిలేయండీ, ఇంక కాలుస్తానండీ-సారీ-కాల్చనండి" అని చిన్నపిల్లాడిలాగా గోలచేస్తూంటే వంటింట్లో వున్న అప్పలమ్మ పరుగెత్తుకునివచ్చి, "భలే, వారే బాబూ" అంటూ నవ్వుకుంటూ వెళ్ళిపోయింది తన పనిలోకి.

కమలమ్మను చూసి "ఇప్పుడైనా వింటావా నాకథను" అని అడిగాడు పరమేశం నవ్వుతూ పడక కుర్చీలో కూర్చుని.

కోకా శ్రీ సుధ

(హైదరాబాద్)

కమలమ్మ అతని ప్రక్కనే క్రిందకూర్చుని 'ఊ' అంది.

అనగా అనగా - అని ఆగిపోయాడు పరమేశం.

కమల ఏం అన్నట్లు చూసింది.

"మరి 'వూ' అనకపోతే కథనడవదు, 'వూ' అను" అని పరమేశం అన్నాడు గోముగా.

"మీ కథకు కాళ్ళుంటాయి అనుకోలేదు. సరా మామూలే అనుకున్నా-సరే కానీయండి" అంది 'వూ' అంటూ.

"ఒక నాయనమ్మ ఆ నాయనమ్మకో మనవరాలు వుండేదట. బలే పెంకిదట. ఆ అమ్మాయి కాస్తంత పెద్దయినాక ఒక జ్యోతిష్కుడు చూచి, బాబోయ్ ఇదిరణపెంకి. భర్తను కొంగున కట్టుకుని తిరుగుతుంది, అని అనగానే ఆ జ్యోతిష్కుణ్ణి ఆ పెంకమ్మాయి, ముప్పతిప్పలు పెట్టి మూకుచెరువు లనీళ్ళు తాగించి తరిమేసిందట..." ఇంక చాలు అని కమల కోపంతో లేచి పోబోయింది.

కాని పరమేశం కమలజడ ఒకచేత్తో అంతకుముందే గట్టిగా పట్టుకుని వుండడంవల్ల లేవలేకపోయింది.

"ఇదిగో కమ్మా నీ విహ్వాళ నాకథను వినాల్సిందే" అని అన్నాడు. కమల బుజాలు పట్టుకుని కూర్చోపెట్టడానికి ప్రయత్నిస్తూ.

"ఆకథ పాత చింతకాయపచ్చడి స్వామీ" అంది కమల విసుగుగా.

"అరే—పాత చింతకాయపచ్చడి ఆరోగ్యంగా నాయనా అంటూ బలవంతాన నానోట్లో పెట్టేది తెలుసా మానాయనమ్మ" అని అన్నాడు పరం సీరియస్‌గా.

"నాకు పనుంది సార్" అంటూ తప్పించుకోబోయింది కమల.

"ఆ పప్పులేం మనదగ్గరుడకవు సారూ! కూర్చోండి" అంటూ బలవంతాన కమలను కూర్చొబెట్టి తనకథను ప్రారంభించాడుపరం.

"కొంతకాలానికి ఆ పెంకమ్మాయి నాయనమ్మ ఇంకో నాయనమ్మ కలిసి గూడుపుఠాని చేసి ఆ "ఇంకో నాయనమ్మ" అర్భకుడైన మనవణ్ణి మెడవంచి మంగళసూత్రం కట్టించేశారట" అనిముగించేశాడు పరమేశం.

కమల విరలబడి నవ్వసాగింది.

"అదేం-అలా నవ్వుతావ్" అని అడిగాడు పరమేశం.

అదే-ఆడపిల్ల మొగవాడి మెళ్ళో మంగళసూత్రం కట్టడమేమిటండీ" అని అంటూ మళ్లా గట్టిగా నవ్వసాగింది.

"అచ్చు పొరబాటు దొర్లింది. పూలదండ వేయించారట, అని చదువుకోవలెను. ఈ పొరబాటును మన్నిస్తారుగదూ! ఇట్లు కథకులు-" అని అన్నాడు పరం తెలివిగా.

"ఇంతకీ కథనెందుకు చెప్పినట్లు, ఎక్కడ సంపాయించినట్లు" అనిఅడిగిందికమలతాపీగా

"మన ఊహా-రేపే రాసి పత్రికకు పంపేస్తాను. అందుకు కావలసిన పరికరాలు, ఓ పెట్టె సిగరెట్లు, మన పెద్ద ఫ్లాస్కు నిండా టీ కావాలి" అని అన్నాడు పరం.

ఇంతేనా ఇంకేమన్నా కావాలా అని అడిగింది కమల.

"అబ్బే-చాలు-దురాశ దుఃఖానికి చేటు అని మన పెద్దలు చెప్పారు తెలుసా" అని అన్నాడు పరం.

"ఊహూ-ఇంతకీ కథ చెప్పింది, సిగరెట్లకూ, టీనీళ్ళకా మహాశయా! లాభం లేదు, మీరు మాత్రం సిగరెట్టు తాగడానికి వీలులేదు" అని కమల లేచి వెళ్ళిపోయింది.

పరమేశం ఇంత బ్రహ్మాండమైన ఐడియా పిచుమిరాయి...గా కరిగిపోయిందేవిటే అనుకుని "హా చంద్రమతీ నేనేమి చేతును" అని ముఖారి రాగం ఆలాపించాడు. ★

---

వీడ్కోలు చెప్పడం పురుషులూ చేస్తే చాలా వరకు పీరిబాధ తగ్గవచ్చు. ఈ సమస్యా పరిష్కారం జరుగవచ్చు. సహృదయులూ, సన్నిహిత బంధువులూ, అయిన వారిని అనాదరం చెయ్యనేవద్దు.

అతిథిపూజా తత్పరమైన ఆంధ్ర దేశంలో ఇలా ఎందుకు రాయవలసి వచ్చిందంటే, వారి అసభ్యత వల్లనే అని మరోమారు చెప్పక తప్పదు. ★